ఆలయాల అభివృద్ధికి కృషి అభినందనీయం: ఎమ్మెల్యే


లక్ష్మీనర్సింహస్వామి ఆలయ ముఖద్వారం నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, అరవింద్‌రెడ్డి

వనస్థలిపురం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): కాలనీవాసులు ఐక్యంగా ఉంటూ ఆలయాలను అభివృద్ధి చేసుకోవడం అభినందనీయమని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ అధ్యక్షుడు కటికరెడ్డి అరవింద్‌రెడ్డి తన సొంత నిధులతో ఎస్కేడీనగర్ కాలనీలోని ప్రసిద్ధ లక్ష్మీనర్సింహస్వామి ఆలయ ముఖద్వార నిర్మాణ పనులకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాలనీలోని ఆలయ ముఖద్వారాన్ని తన నిధులతో కటికరెడ్డి అరవింద్‌రెడ్డి నిర్మించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ సోమిరెడ్డి, కన్వీనర్ వెంకటేశ్వర్‌రావు, కార్యదర్శి జానకిరామారావు, కాలనీవాసులు పుల్లారెడ్డి, అమరేందర్‌రెడ్డి, రఘురామ్‌నేత, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాలనీవాసుల సమస్యలను పరిష్కరిస్తా

వనస్థలిపురం : కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. వనస్థలిపురం డివిజన్ పార్థివాడ(పిట్టలబస్తీ) బస్తీవాసుల కోరిక మేరకు ఎమ్మెల్యే శనివారం పర్యటించి కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. చిన్నపాటి వర్షానికే డ్రైనేజీలు పొంగుతున్నాయని, నూతన రోడ్ల నిర్మాణం చేపట్టాలని కాలనీవాసులు ఎమ్మెల్యేను కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ డ్రైనేజీ విషయంలో ఎవరు కూడా ఎలాంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్‌రెడ్డి, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు చింతల రవికుమార్, కాలనీవాసులు పాల్గొన్నారు.


ఎగ్జిబిషన్‌లో చేనేత వస్తువులను కొనుగోలు చేస్తున్న మహిళలు

ఆకట్టుకుంటున్న హ్యాండ్లూమ్, హ్యాండీక్రాఫ్ట్ మేళా

వనస్థలిపురం, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): వనస్థలిపురం ఓపెన్ కమ్యూనిటీ హాల్లో ఏర్పాటు చేసిన ఆల్‌ఇండియా హ్యాండ్లూమ్ అండ్ హ్యాండీక్రాఫ్ట్ మేళా ఎగ్జిబిషన్ అండ్ సేల్ విశేషంగా ఆకట్టుకుంటుంది. ఈ ఎగ్జిబిషన్‌లో మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరిశారీస్, భాగల్‌పూర్‌శారీస్, డిజైనర్‌శారీస్, కాంతావర్క్స్‌శారీస్, హ్యాండ్ బ్లాక్ ప్రింటెడ్‌శారీస్, లినెన్‌శారీస్, కలంకారీశారీస్, బెంగాల్ కాటన్‌శారీస్, లేడీస్ ఫ్యాన్సీ టాప్స్, డిజైనర్ బ్లౌస్స్, లక్నో చికెన్, బనారస్ శారీస్, ఖాదీ మెటీరియల్, వన్ గ్రామ్ గోల్డ్ జ్యువెల్లరీ, జైపూర్ బెడ్ షీట్స్, కొండపల్లి టాయ్స్, ఇతర అనేక చేనేత ఉత్పత్తులు ప్రదర్శనలో ఉంచారు. ఈ సందర్భంగా నిర్వాహకులు అక్బర్ అలీ మాట్లాడుతూ చేనేత కళాకారులను ఆదుకునేందుకు ఏర్పాటు చేసిన హస్త కళా ప్రదర్శనను ఎల్బీనగర్ పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దేశవ్యాప్తంగా పేరుగాంచిన చేనేత ఉత్పత్తులను తమ ఎగ్జిబిషన్‌లో ఉంచామన్నారు. అన్నివర్గాల ప్రజలు కొనుగోలు చేసే విధంగా చేనేత ఉత్పత్తుల ధరలను అందుబాటులో ఉంచామని తెలిపారు. ఈ ప్రదర్శన ప్రతి రోజు ఉదయం 10.30ల నుంచి రాత్రి 9గంటల వరకు కాలనీవాసులకు అందుబాటులో ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

హామీల అమలుకు శ్రీకారం : జితేందర్

చంపాపేట, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల మేరకు ప్రతి ఒక్కటి అమలుకు శ్రీకారం చుట్టినట్లు టీపీసీ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్ అన్నారు. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి మెట్టు వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో చంపాపేటలోని సూర్యానగర్ ఎడబస్తీలోని సాయికుమార్, జ్యోతి దంపతుల ఇంట్లో శనివారం కాంగ్రెస్ ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా అందించిన సన్నబియ్యంతో వండిన భోజనాన్ని మిద్దెల జితేందర్‌తో కలిసి పలువురు కాంగ్రెస్ నాయకులు భుజించారు. ఈ సందర్భంగా జితేందర్ మాట్లాడుతూ రాష్ట్రంలో మూడుకోట్ల 10లక్షల మందికి రాష్ట్ర ప్రభుత్వం రేషన్‌షాప్‌ల ద్వారా సన్నబియ్యం అందిస్తుందని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బండి సురేందర్, మెట్టు వెంకట్‌రెడ్డి, ఈషూరి బద్రీనాథ్, భగవాన్, చింటూ, వెంకటేష్, ఆడేళ్ల రాజా, సాయికుమార్, ప్రసాద్‌నాయక్ పాల్గొన్నారు.

మోదీ, కిషన్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు.. అద్దంకి, అంజన్‌పై పోలీసులకు ఫిర్యాదు

సరూర్‌నగర్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్‌లపై కేసునమోదు చేసి చర్యలు తీసుకోవాలని బీజేవైఎం, బీజేపీ నేతలు మీర్‌పేట్ పోలీసులను కోరారు. ఈ మేరకు శనివారం బీజేవైఎం రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు చింతల రాఘవేందర్‌ముదిరాజ్ ఆధ్వర్యంలో మోర్చా, బీజేపీ నేతలు ఇన్‌స్పెక్టర్ నాగరాజును కలిసి వారిపై ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో బీజేపీ మీర్‌పేట్ క్లస్టర్-2 అధ్యక్షుడు తులసి ముఖేశ్‌ముదిరాజ్, జిల్లా కౌన్సిల్ మెంబర్ ఎం.కరుణానిధి, మోర్చా మీర్‌పేట్ ఉపాధ్యక్షుడు ప్రదీప్, కిసాన్‌మోర్చా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

చాదర్‌ఘాట్ : ఈడీ కార్యాలయం ఎదుట ధర్నాలో ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డిలపై కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్ చేసిన అనుచిత వ్యాఖ్యలపై బీజేవైఎం భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు అనుముల భరత్‌తో కూడిన బృందం శనివారం మలక్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈమేరకు ఆయన రాతపూర్వకమైన ఫిర్యాదు పత్రాన్ని మలక్‌పేట ఇన్‌స్పెక్టర్ నరేష్‌కు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు జె.దినేష్, నవీన్ బండారి, జగన్, భార్గవ్‌చారి, నవీన్ పటాలియా, ఆశిష్ గౌలికార్, రేవంత్, రోహన్, సుభాష్ పాల్గొన్నారు.

పదోన్నతి పొందిన యాదయ్యకు సన్మానం

హయత్‌నగర్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులకు పదోన్నతులు, పదవి విరమణ సర్వసాధారణమని జీహెచ్ఎంసీ హయత్‌నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ తిప్పర్తి యాదయ్య అన్నారు. స్పెషల్ గ్రేడ్ మున్సిపల్ కమిషనర్‌గా జీహెచ్ఎంసీ హయత్‌నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌గా పనిచేస్తున్న డాక్టర్ తిప్పర్తి యాదయ్య సెలక్షన్ గ్రేడ్ కమిషనర్‌గా పదోన్నతి పొందారు. శనివారం హయత్‌నగర్ సర్కిల్‌కు చెందిన అధికారులు, ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల నాయకులు ఉపకమిషనర్ యాదయ్యను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉద్యోగ సంఘాల నాయకులు శ్రీనివాస్‌గౌడ్, నర్సింగ్‌రావు, జీహెచ్ఎంసీ హయత్‌నగర్ సర్కిల్ అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ దినేష్‌సింగ్, సూపరింటెండెంట్లు మహేందర్, విక్రమ్, సుధాకర్‌రావు, దాసరి అర్చన, జావేద్, మహ్మద్ అయుబ్‌ఖాన్, హరికాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

సరూర్‌నగర్‌లో ఎస్టీపీ ఏర్పాటు చేయాలి


జలమండలి ఎండీ అశోక్‌రెడ్డికి వినతి పత్రం ఇస్తున్న కార్పొరేటర్ రాజశేఖర్‌రెడ్డి

ఎల్‌బీనగర్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): సరూర్‌నగర్ చెరువు నూతన ఎస్టీపీ ఏర్పాటు చేయాలని జీహెచ్ఎంసీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి జలమండలి ఎండీ అశోక్‌రెడ్డిని కోరారు. శనివారం జలమండలి ఎండీని కలిసి ఎస్టీపీ విషయంపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరూర్‌నగర్ చెరువులోకి వస్తున్న మురుగునీటిని శుద్ధి చేసే సామర్థ్యం ప్రస్తుత ఎస్టీపీకి లేదన్నారు. దీంతో శుద్ధి చేయని మురుగునీరు నేరుగా చెరువులోకి చేరి కాలుష్యంతో పాటు పర్యావరణం దెబ్బతినడానికి కారణమవుతున్నాయన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రస్తుత ఎస్టీపీ సామర్థ్యం పెంచడం కానీ లేదా నూతన ఎస్టీపీ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

గాలివానకు నేలకొరిగిన ట్రాన్స్‌ఫార్మర్ల పునరుద్ధరణ


గండిచెరువులో ఈదురు గాలులకు కూలిన విద్యుత్ స్తంభాలను పునరుద్ధరిస్తున్న విద్యుత్ అధికారులు

అబ్దుల్లాపూర్‌మెట్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని గండిచెరువు గ్రామంలో శుక్రవారం కురిసిన గాలివానకు నేలకొరిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లతో పాటు విద్యుత్ స్తంభాలను శనివారం అబ్దుల్లాపూర్‌మెట్ విద్యుత్ అధికారులు పునరుద్ధరించారు. గండిచెరువు గ్రామంలో ఈదుర గాలులకు రెండు విద్యుత్ స్తంభాలతో పాటు 8 విద్యుత్ స్తంభాలు నేలకొరిగినట్లు గుర్తించినట్లు ఏఈ నరేందర్ తెలిపారు. సిబ్బందితో కలిసి శనివారం పురరుద్ధరణ పనులు చేపట్టినట్లు చెప్పారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా వెంటనే పనులను చేపట్టినట్లు పేర్కొన్నారు.

పంటలను పరిశీలించిన ఏఎంసీ వైస్ చైర్మన్

శుక్రవారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షానికి గండిచెరువు గ్రామంలో దెబ్బతిన్న పంటలను గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ సీహెచ్ భాస్కరాచారి, మండల వ్యవసాయ విస్తరణ అధికారి రఘుతో కలిసి శనివారం పరిశీలించారు. సుమారు 20 ఎకరాల్లో వరితో పాటు కూరగాయల పంటలు దెబ్బతిన్నట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు. ఈదురు గాలుల దాటికి తాటిచెట్లు సైతం నేలకొరిగాయి. 20 నుంచి 50శాతం వరకు పంట నష్టం వాటినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.


అకాల వర్షానికి ఇంటిపైన విరిగిపడిన చెట్టు

ఉమర్‌ఖాన్‌గూడ, సంఘీనగర్‌లో..

హయత్‌నగర్: అకాల వర్షం, ఈదురు గాలికి ఉమర్‌ఖాన్‌గూడ, సంఘీనగర్‌లలో భారీ నష్టం ఏర్పడింది. గాలికి అనేక ఇళ్లపైన రేకులు లేచిపోయాయి. చెట్లు, విద్యుత్ స్తంభాలు ఇళ్లపైన విరిగిపడ్డాయి. దీంతో ప్రజలకు తీవ్ర నష్టం ఏర్పడింది. శుక్రవారం సాయంత్రం ఒక్క సారిగా గాలి రావడంతో దాదాపు ఐదు ఇళ్లకు పై కప్పులు లేచిపోయాయి. మూడు ఇళ్లపైన చెట్లు విరిగి పడ్డాయి. దాదాపు మూడు గంటల పాటు కరెంటు విద్యుత్ ప్రసారంలో అంతరాయం కలిగింది. నిత్యావసర వస్తువులు, విలువైన వస్తువులు కొట్టుకుపోయాయి. స్థానిక మాజీ కౌన్సిలర్ కడారి శ్రీలత అనీల్‌కుమార్ బాధితులను పరామర్శించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు శ్రీశైలం, రాము, దీక్షిత్ పాల్గొన్నారు.

పశ్చిమబెంగాల్‌లో రాష్ట్రపతి పాలన విధించాలి

- హిందువులపై దాడులకు నిరసనగా వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ ఆందోళన
- దిల్‌సుఖ్‌నగర్ చౌరస్తాలో సీఎం మమతాబెనర్జీ దిష్టిబొమ్మ దహనం


దిల్‌సుఖ్‌నగర్ చౌరస్తాలో సీఎం మమతాబెనర్జీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ కార్యకర్తలు

దిల్‌సుఖ్‌నగర్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): పశ్చిమ బెంగాల్‌లో వెంటనే రాష్ట్రపతి పాలన విధించాలని వీహెచ్‌పీ జాతీయ అధికార ప్రతినిధి రావినూతల శశిధర్ డిమాండ్ చేశారు. పశ్చిమ బెంగాల్‌లో హిందువులపై దాడులను ఖండిస్తూ వీహెచ్‌పీ వివేకానంద జిల్లాశాఖ, భజరంగ్‌దళ్‌ల ఆధ్వర్యంలో శనివారం దిల్‌సుఖ్‌నగర్ చౌరాస్తాలో నిరసన కార్యక్రమం చేపట్టారు. వందలాది మంది కార్యకర్తలు జాతీయ రహదారిపై బైఠాయించి, సీఎం మమతా బెనర్జీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వీహెచ్‌పీ జాతీయ అధికార ప్రతినిధి రావినూతల శశిధర్, వీహెచ్‌పీ వివేకానంద జిల్లా అధ్యక్షుడు పురుషోత్తంరెడ్డిలు మాట్లాడుతూ వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లుకు వ్యతిరేకంగా కొందరు ముష్కర మూకలు హిందువులపై దాడులు చేసి చంపి, ఆస్తులను లూటీ చేయడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో భయాందోళనకు గురైన వందలాది మంది హిందువులు ఇళ్లను ఖాళీ చేసి వెళ్లిపోయారన్నారు. ఇంత జరుగుతున్నా పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జీ రక్షణ చర్యలు చేపట్టకపోవడం హిందువుల పట్ల ఆమెకున్న వివక్షను తెలుపుతుందన్నారు. ఓటు బ్యాంక్ కోసం దేశ రక్షణకే ఆటంకంగా మారేలా చేసిందని ఆరోపించారు. వెంటనే కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని పశ్చిమ బెంగాల్‌లో రాష్ట్రపతి పాలన విధించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్‌లు బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి, రంగా నర్సింహగుప్తా, ఆకుల శ్రీవాణి అంజన్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు అరుట్ల సురేష్‌ముదిరాజ్, సిద్దుముదిరాజ్, నర్సింహారెడ్డి, గడ్డిఅన్నారం డివిజన్ అధ్యక్షుడు దాసరి జయప్రకాష్, బీజేవైఎం సీనియర్ నాయకులు గగ్‌గమ్ నవీన్‌కుమార్, వీహెచ్‌పీ నాయకులు కళ్లెం రాజేందర్‌రెడ్డి, వెలుగు సాయిరాం పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో కిచెన్ షెడ్డు ప్రారంభం


కొహెడ ప్రభుత్వ పాఠశాలలో కిచెన్ షెడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రంగారెడ్డి

హయత్‌నగర్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): తుర్కయంజాల్ మున్సిపాలిటీలోని కొహెడ ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో క్యూబా ఫోర్ ఫౌండేషన్ ఛైర్మన్ కందాళ కుషాల్‌రెడ్డి సొంత నిధులు రూ.4లక్షలతో నిర్మించిన కిచెన్ షెడ్డును శనివారం ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంఈఓ జగదీష్, తుర్కయంజాల్ మున్సిపల్ కమిషనర్ అమరేందర్ రెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు తిరుపతి బాయి, గోవర్ధన్‌రెడ్డి, ధన్‌రాజ్‌గౌడ్, రాఘవేందర్‌రెడ్డి, దన్నే రాజు పాల్గొన్నారు.

పార్థసారథిరెడ్డిని కలిసిన మీర్‌పేట్ సాయి పీఠాధిపతి

సరూర్‌నగర్, ఏప్రిల్, 19(ఆంధ్రజ్యోతి): మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని ప్రశాంతిహిల్స్‌లో గల శ్రీద్వారకామాయి సాయి పీఠాధిపతి గోపాలకృష్ణానంద స్వామీజీ శనివారం తన కుటుంబ సభ్యులతో కలిసి రాజ్యసభ సభ్యుడు, హెటిరో గ్రూప్స్ ఛైర్మన్ డాక్టర్ బి.పార్థసారథిరెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఈనెల 24, 25 తేదీల్లో జరుగనున్న తన కుమార్తె, కుమారుడి వివాహ నిశ్చితార్థ శుభకార్యాలకు విచ్చేయాల్సిందిగా కోరుతూ స్వామీజీ ఆయనకు ఆహ్వాన పత్రిక అందజేశారు.

నాగోల్‌లో 'గావ్ చలో-బస్తీ చలో'

మన్సూరాబాద్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): వాజ్‌పేయ్ శతజయంతి, బీజేపీ 45వ ఆవిర్భావ ఉత్సవాల్లో భాగంగా శనివారం నాగోల్ డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో 'గావ్ చలో - బస్తీ చలో' కార్యక్రమాన్ని నిర్వహించారు. బీజేపీ డివిజన్ అధ్యక్షుడు పంగ శ్రీకాంత్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీజేపీ రంగారెడ్డి జిల్లా మాజీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి విచ్చేసి పలు సేవా కార్యక్రమాలను చేపట్టారు. ఇందులో భాగంగా ఆంజనేయ స్వామి ఆలయంతో పాటు పలు బస్తీలను శుభ్రం చేయడం, 40 ఏళ్లుగా బీజేపీలో సేవలందిస్తున్న సీనియర్ నాయకులను సత్కరించడం, బస్తీవాసులతో కలిసి సహబంతి భోజనం చేయడంతో పాటు బీజేపీ జెండా ఆవిష్కరణ వంటి కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో నాగోల్ ఇన్‌చార్జి బండారి భాస్కర్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, ఆయా కాలనీవాసులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మిక సంఘం మహాసభలను విజయవంతం చేద్దాం : యాదిరెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌లో ఈనెల 21, 22వ తేదీల్లో జరుగనున్న భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ముత్యాల యాదిరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం కుంట్లూర్ ఆర్ఎన్ఆర్ కాలనీ ఫేజ్-3లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో యాదిరెడ్డి మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు ప్రభుత్వమే ఇందిరమ్మ ఇళ్లు కట్టివ్వాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు అజ్మీర్ హరిసింగ్‌నాయక్, ఓబీజీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్, కేతరాజు నర్సింహ, నిరంజన్ పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

హయత్‌నగర్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్ డివిజన్‌లోని ఇన్నర్మేషన్ కాలనీలో కళ్లెం పెంటారెడ్డి జ్ఞాపకార్థం కొంత మంది యువకులు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు యువకులు చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం గొప్ప విషయం అన్నారు. అఖిలేష్‌రెడ్డి, ప్రణవ్, మల్లేష్, ఖాజా, నాగగౌడ్, చరణ్‌గౌడ్ పాల్గొన్నారు.

చాదర్‌ఘాట్ : ఆధ్యాత్మిక విశ్వగురువు వైజ్ఞానిక రుషి గురు విశ్వ స్ఫూర్తి దివ్యాశీస్సులతో చైతన్యపురిలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎస్‌ఐ భద్రయ్య శనివారం ప్రారంభించారు. నిర్వాహకులు వెంకటస్వామి, నర్సింహారెడ్డి, శ్రీకృష్ణ మాట్లాడుతూ ప్రజల దాహార్తిని చలివేంద్రాలు తీర్చుతాయన్నారు.

భూగర్భ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన

హయత్‌నగర్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): తుర్కయంజాల్ మున్సిపాలిటీ కమ్మగూడ 22వ వార్డులోని నవభారత్‌కాలనీ, రాజ్‌రంజిత్ కాలనీలోని 13 లైన్లలో రూ. 1కోటి 10లక్షలతో చేపట్టనున్న భూగర్భ డ్రైనేజీ పనులకు 22వ వార్డు మాజీ కౌన్సిలర్ కొశిక ఐలయ్య శనివారం శంకుస్థాపన చేశారు. దీంతో రెండు కాలనీలలో పూర్తిగా భూగర్భ డ్రైనేజీ పనులు పూర్తవుతాయని తెలిపారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, లోహిత్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, వెంకట్‌రెడ్డి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

పోషకాహారాన్ని అందించడమే లక్ష్యం : కార్పొరేటర్

సైదాబాద్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ఆరోగ్యకరమైన పోషకాహారాన్ని అందించడమే పోషణ్ అభియాన్ లక్ష్యమని కార్పొరేటర్ కొత్తకాపు అరుణారవీందర్‌రెడ్డి అన్నారు. పోషణ్ పక్వాడలో భాగంగా శనివారం రెడ్డిబస్తీలోని మూడుగుళ్ల వద్ద ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాలలో ప్రభుత్వాలు అందిస్తున్న పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఐసీడీఎస్ అధికారి పావని, సూపర్‌వైజర్ పార్వతీ, టీచర్ శ్రీలత పాల్గొన్నారు.

రోడ్లపై కూలిన చెట్ల తొలగింపు

సైదాబాద్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): శుక్రవారం రాత్రి ఈదురుగాలులతో కురిసిన భారీ వర్షానికి ఐఎస్‌సదన్ డివిజన్‌లోని సుబ్రహ్మణ్యంనగర్, వినయ్‌నగర్, మనోహర్, ఎస్ఎన్‌రెడ్డినగర్, ఆదర్శనగర్‌లలో చెట్టుకూలిపోయి రోడ్లపై పడ్డాయి. దీంతో రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడడంతో పాటు విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో స్పందించిన జీహెచ్ఎంసీ డీఆర్ఎఫ్ బృందాలు, ఇంజనీరింగ్ సిబ్బంది పునరుద్ధరణ చర్యలు చేపట్టి సమస్యను పరిష్కరించారు. కార్యక్రమంలో బీజేపీ భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు జంగం మధుకర్‌రెడ్డి, ఏఈ శిరీష, డీఆర్ఎఫ్ సిబ్బంది సందీప్, శేఖర్, సతీష్, మధు పాల్గొన్నారు.


పెద్దఅంబర్‌పేట్ మున్సిపల్ కమిషనర్ సింగిరెడ్డి రవీందర్‌రెడ్డి గ్రేడ్-2 కమిషనర్‌గా పదోన్నతి పొందడంతో శనివారం కార్యాలయంలో ఆయనను అధికారులు శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. డీఈఈ సదానందం, మేనేజర్ కిరణ్‌కుమార్, ఆర్ఓ హరికుమార్, రమాదేవి, ఆంజనేయులు ఉన్నారు. - అబ్దుల్లాపూర్‌మెట్, ఆంధ్రజ్యోతి

విద్యార్థుల భవితకు బాటలు వేసేది ఉపాధ్యాయులే

- మేడ్చల్ డీఈఓ ఐ. విజయకుమారి


మాట్లాడుతున్న డీఈఓ విజయకుమారి

కొత్తపేట, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల మంచి భవితకు బాటలు వేసేది ఉపాధ్యాయులేనని, ఉద్యోగ విరమణ పొందిన కొత్తపేట జడ్పీహెచ్ఎస్ గజిటెడ్ హెడ్‌మాస్టర్ కోమటిరెడ్డి విజేందర్‌రెడ్డి సేవలు అందరికీ మార్గనిర్దేశం కావాలని మేడ్చల్ డీఈఓ ఐ.విజయకుమారి అన్నారు. శనివారం పాఠశాలలో హెచ్ఎం విజేందర్‌రెడ్డి ఉద్యోగ విరమణ అభినందన సభలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విజేందర్‌రెడ్డి 42 సంవత్సరాల విధి నిర్వహణలో విద్యాపరమైన అంశాలకు ప్రాధాన్యతనిచ్చారన్నారు. విశిష్ట అతిథి ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధిలో హెచ్ఎం విజేందర్‌రెడ్డి భాగస్వామ్యం అభినందనీయమని, మౌలిక సదుపాయాల కల్పనకు సహకారం అందిస్తామని అన్నారు. కార్పొరేటర్ పవన్‌కుమార్, జిల్లా గజిటెడ్ హెచ్ఎంల సంఘం ప్రతినిధులు శ్రీరాంరెడ్డి, మురళీమోహన్, లక్ష్మి మాట్లాడారు. ఉప్పల్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు విజేందర్‌రెడ్డి దంపతులను శాలువాలు, పూలమాలలతో సన్మానించారు.

సీనియర్ సివిల్ జడ్జి బదిలీ

రంగారెడ్డి జిల్లా కోర్టులు : రంగారెడ్డి జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి పి. శ్రీదేవి నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ సీనియర్ సివిల్ జడ్జిగా బదిలీ అయ్యారు. శనివారం విధుల నుంచి రిలీవ్ అయిన సందర్భంగా సహచర న్యాయమూర్తులు, జిల్లా కోర్టుల న్యాయవాదులు, న్యాయసేవాధికార సంస్థ ఉద్యోగులు, సిబ్బంది, ప్యారాలీగల్ వలంటీర్లు ఆమెను సన్మానించి వీడ్కోలు పలికారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

హయత్‌నగర్ : మన్సూరాబాద్ డివిజన్ హయత్‌నగర్ ఏరియాలోని టీనగర్‌లో శనివారం రూ.11లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్యాగరాజ నగర్ కాలనీలోని సీసీ రోడ్డు పనులు టెండర్లు అయిన తర్వాత కూడా రద్దు అయ్యాయని తెలిపారు. జోనల్ కమిషనర్ సహకారంతో తిరిగి సీసీ రోడ్డు పనులకు మంజూరు తీసుకురావడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

నాణ్యతతో పనులు చేపట్టాలి

వనస్థలిపురం: భవిష్యత్ తరాలకు ఉపయోగపడేవిధంగా అభివృద్ధి పనులు చేపట్టాలని కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్ రెడ్డి అన్నారు. వనస్థలిపురం డివిజన్‌లోని జైహింద్‌బాబుకాలనీ, పిట్టలబస్తీలో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ శనివారం పరిశీలించాడు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ అభివృద్ధి పనులను నాణ్యతతో చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. సాయికిరణ్ గౌడ్, ఉప్పు వెంకటేష్ పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలి


జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో వనపల్లి శ్రీనివాస్‌రెడ్డి, కార్పొరేటర్ మధుసూదన్‌రెడ్డి

చంపాపేట, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయాలని బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు వనపల్లి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. వాజ్‌పేయ్ శతజయంతి ఉత్సవాల్లో భాగంగా శనివారం బీజేపీ చంపాపేట డివిజన్ అధ్యక్షుడు పోరెడ్డి రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో గావ్ చలో బస్తీ చలో అభియాన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీజేపీ అర్బన్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి హాజరై చంపాపేట గాంధీ చౌరస్తాలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పార్టీ ముఖ్య నేతలతో కలిసి వారు డివిజన్‌లోని ఎస్‌బీఐకాలనీలోని శివాలయం, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ డివిజన్ మహిళా అధ్యక్షురాలు రజిత, నాయకులు శైలజ, శ్రీనిధి, గూడూరు అవినాష్‌రెడ్డి, సుంకరి రమేష్‌గౌడ్, తిరుపతి, యోగిరాజ్, జగదీశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

మేస్త్రీ, కూలీ మధ్య వాగ్వాదం

- కోపంతో బైక్‌ను కాల్చేశాడంటూ కూలీపై మేస్త్రీ ఫిర్యాదు

మన్సూరాబాద్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): పనికి వాడే యంత్రాన్ని పాడుచేశావంటూ ఓ మేస్త్రీ తన వద్ద పనిచేసే కూలీతో వాగ్వాదానికి దిగడంతో ఆ కూలీ ఆ మేస్త్రీకి చెందిన ద్విచక్రవాహనాన్ని కాల్చివేసిన అనుమానాస్పద ఘటన నాగోల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. నాగోల్‌లోని తట్టిఅన్నారం హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన తాపీ మేస్త్రీ షేక్ మహబూబ్ బాషా తన వద్ద పనిచేసే ముగ్గురు కూలీలు షేక్ మౌలాలి, షేక్ నూర్‌బాషా, సురేష్‌లతో కలిసి తట్టిఅన్నారంలోని రేణుకా వైన్స్ వద్ద మద్యం సేవించేందుకు శుక్రవారం రాత్రి తనకు చెందిన ద్విచక్రవాహనాల (ఏపీ12ఈ8072, ఏపీ21ఏక్యూ0616)పై వచ్చారు. మద్యం సేవిస్తున్న క్రమంలో పనికి వాడే పలకలను కత్తిరించే యంత్రాన్ని పాడు చేశావంటూ మేస్త్రీ షేక్ మహబూబ్ బాషా, కూలీ షేక్ నూర్‌బాషాకి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. షేక్ నూర్‌బాషాను వైన్స్ వద్దే వదిలేసిన షేక్ మహబూబ్‌బాషా అతడి వద్ద ఉన్న తన మరో బైక్ (ఏపీ12ఈ8072)కి చెందిన తాళాలను తీసుకుని తన బైక్(ఏపీ21 ఏక్యూ0616)పై ఇంటికి వెళ్లి పోయాడు. కొంత సమయం తర్వాత వైన్స్ సమీపంలో వదిలేసి వెళ్లిన తన బైక్ కాలిపోతుందంటూ సమాచారం అందుకున్న షేక్ మహబూబ్‌బాషా వెంటనే అక్కడికి చేరుకుని చూడగా బైక్ పూర్తిగా కాలిపోయింది. ఇది షేక్ నూర్‌బాషా పనేనంటూ అనుమానం వ్యక్తం చేస్తూ శనివారం నాగోల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపడుతున్నారు.

విలేకరుల ముసుగులో బ్లాక్‌మెయిల్

- బెదిరించి డబ్బులు వసూలు చేస్తున్న ఇద్దరు నకిలీ విలేకరుల అరెస్టు

దిల్‌సుఖ్‌నగర్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): విలేకరుల ముసుగులో బ్లాక్ మెయిల్ చేస్తూ.. వ్యాపారులను బెదిరించి డబ్బులు వసూలు చేస్తున్న ఇద్దరు నకిలీ విలేకరుల ఆటకట్టించారు సరూర్‌నగర్ పోలీసులు. వారి వద్ద నుంచి ప్రెస్ రిపోర్టర్స్ పేరుతో ఉన్న నకిలీ ఐడీ కార్డులు స్వాధీనం చేసుకొని కటకటాల్లోకి నెట్టారు. సరూర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సరూర్‌నగర్‌లోని వెంకటేశ్వరకాలనీలో శ్రీబాలాజీ మిఠాయి బండార్ దుకాణం ఉంది. ఈనెల-18న మధ్యాహ్నం 1.30కు ఇద్దరు వ్యక్తులు వచ్చి స్వీట్స్ కొని అక్కడే తింటున్నారు. ఈ క్రమంలో తాము కొన్న స్వీట్స్‌లో ఎండు రొయ్య వచ్చిందంటూ చూపించి హల్‌చల్ చేసి వాంతు చేసుకున్నారు. అనంతరం తాము రిపోర్టర్లమని ఆర్‌ఈ-5 అనే ప్రెస్ ఐడీ కార్డులు చూపించారు. మీ షాపులో స్వీట్స్ కొన్నవారికి వాంతులు అవుతాయంటూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టి దుకాణం మూయించేస్తామని బెదిరించారు. అలా చేయకుండా ఉండాలంటే డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దాంతో విషయం అర్థం చేసుకున్న దుకాణం యజమానులు పోలీసులకు ఫోన్ చేయడంతో వారు అక్కడి నుంచి పారిపోయారు. దుకాణం యజమాని ఫిర్యాదు మేరకు సరూర్‌నగర్ పోలీసులు రంగంలోకి దిగి నిందితులను గుర్తించారు. చిర్ర కోటేష్, వడ్లకొండ నరేష్ ఆర్‌ఈ-5 యూట్యూబ్ చానల్ పేరుతో చలామని అవుతున్నట్లు తేలింది. ఇలా యూట్యూబ్ చానల్ ఐడీలతో నకిలీ విలేకరుల అవతారం ఎత్తి దందాలకు పాల్పడుతున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. చిర్ర కోటేష్ హయత్‌నగర్ డివిజన్ రిపోర్టర్‌గా, వడ్లకొండ నరేష్ డిజైనర్‌గా.. తెలంగాణ ఫొటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ మెంబర్‌గా ఐడీ కార్డులు తయారు చేసుకున్నట్లు పోలీసులు గుర్తించారు. బ్లాక్‌మెయిల్ చేసి వసూల్ చేసిన డబ్బును ఇద్దరూ చెరిసగం పంచుకుంటున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు.